క్లుప్తంగా

క్లీన్ ఇండియా కోసం కృషి చేయాలి

కనిమెర్ల(మైలవరం): వీధుల్లో చెత్త వేయకుండా క్లీన్ ఇండియా కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో కళాశాల వలంటీర్లు నాలుగో రోజు మంగళవారం స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్, వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ చీపురు పట్టి వీధుల్లోని చెత్త ఊడ్చివేయాలన్నారు. తద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

కలుపు మొక్కలను తొలగించాలి

తిరువూరు: పశువులు, మనుషులపై దుష్ప్రభావం చూపే వయ్యారిభామ కలుపు మొక్కలను తొలగించాలని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కలుపుమొక్కల నిర్మూలనపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ వయ్యారిభామ, క్యారెట్ గడ్డి, నక్షత్ర గడ్డి తదితర పేర్లతో పిలిచే మొక్కలు అత్యంత ప్రమాదకరమని తెలిపారు. రైతులకు ఈ మొక్కలపై వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించి కలుపుమొక్కల తొలగింపుకు సహకరించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

పార్థీనియం కలుపు మొక్కలు ప్రమాదకరం

చంద్రాల(మైలవరం): పార్థీనియమ్(వయ్యారిభామ) కలుపు మొక్కలు ప్రమాదకరం అని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల సచివాలయంలో సర్పంచ్ జే జ్యోతి అధ్యక్షతన పార్థీనియం కలుపు మొక్కల నివారణపై అవగాహనా సదస్సు మంగళవారం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు చంద్రాల గ్రామంలో చాలా కాలంగా ప్రజలను, రైతులను వేధిస్తున్న పార్థీనియం కలుపు మొక్కలను నివారణకు పంచాయతీ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ మొక్కలు ద్వారా ఉబ్బసం, టీబీ, ఆయాసం తదితర వ్యాధులు చిన్న పిల్లల్లో తలెత్తుతున్నాయన్నారు. ఈ మొక్కల వలన పంటల దిగుబడులు తగ్గుతున్నాయని తెలిపారు. బుధవారం మొక్కల నివారణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

వావిలాలలో పశు విజ్ఞాన బడి

వావిలాల(తిరువూరు): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వావిలాలలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ గోపీచంద్ ఈ కార్యక్రమంలో పాల్గొని పశువులకు తరచు వచ్చే సీజనల్ వ్యాధులు, నివారణోపాయాలను వివరించారు. గాలికుంటు వ్యాధి బారిన పడకుండా పశువులకు తగు రక్షణ ఏర్పాట్లు చేయాలని, టీకాలు వేయించాలని సూచించారు. అధిక పాలదిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్వేత, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలి

మైలవరం: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కృష్ణా జిల్లా కన్వీనర్ మంద వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. మహాజన నేత మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు మైలవరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం స్థానిక పంచాయతీ అతిథి గృహంలో మంగళవారం ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంకొల్లు జమలయ్య మాదిగ అధ్యక్షతన జరిగింది. బీజేపీ ప్రభుత్వం మాదిగలకు నమ్మక ద్రోహం చేస్తోందన్నారు. ఈ నెల 31వ తేదీన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం, ఏప్రిల్ 4న విజయవాడ నగరం నాలుగు వైపులా ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం ప్రారంభం

మైలవరం: వ్యవసాయ శాఖ మైలవరం ఏడీ కార్యాలయం బుధవారం ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. మైలవరంలోని ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన ఏడీ కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



గుంటుపల్లిలో వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి



వైఎస్సార్ ఆసరా నిధుల చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళాభ్యున్నతికి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తూ అతివల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. వైఎస్సార్ ఆసరా వేడుకల్లో భాగంగా గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ హాల్‌లో ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 1,759 డ్వాక్రా గ్రూపులకు రూ.17.36 కోట్ల చెక్కు విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు 600 హామీలు ఇచ్చి నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. వాటిలో డ్వాక్రా రుణమాఫీ కూడా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు హామీలతో అమ్మఒడి, చేయూత, ఆసరా, విద్యా దీవెన, రైతు భరోసా తదితర సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేపట్టారన్నారు. లబ్ధిదారులు జగనన్నకు కృతజ్ఞత కలిగి ఉండాలన్నారు. చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఇబ్రహీంపట్నం జి.కొండూరు ఎంపీపీలు పాలడుగు జోత్స్న, వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, రెడ్డిగూడెం జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సూర్యారావు, మండల కన్వీనర్ సాంబశివరావు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలపై దృష్టి సారించాలి

జి.కొండూరు: మహిళలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహాన్ని సద్వినియోగపరుచుకుని కుటీర పరిశ్రమలపై దృష్టి సారిస్తే, మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైస్కూల్‌కు తన సొంత నిధులు రూ.లక్షతో అందించిన స్పోర్ట్స్ మెటీరియల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మంజూరైన మూడు ట్రాక్టర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో ప్రముఖపాత్ర పోషించే మహిళలకు ఆర్థిక చేయూతనిస్తే, కుటుంబం ఆర్థికంగా బలపడతుందనే లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వం 99శాతం పథకాల నగదును మహిళల ఖాతాలలో నేరుగా జమ చేస్తోందన్నారు. మైలవరం నియోజకవర్గంలో 20వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయగా 17 వేల మందికి పక్కా గృహాలను సైతం మంజూరు చేసినట్లు తెలిపారు. దేవినేని ఉమామహేశ్వరరావు మంత్రిగా ఉన్నప్పుడు శిలాఫలకాలకే పరిమితమైన రహదారుల అభివృద్ధి, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యరూపం దాల్చిందన్నారు. రాజకీయ ఉనికి కోసం దేవినేని ఉమామహేశ్వరరావు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై అసత్య ప్రచారాలను చేస్తూ పబ్బం గడుపుతున్నాడని మండిపడ్డారు. దేవినేని ఉమామహేశ్వరరావు వికృత చేష్టలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని, రాబోయే ఎన్నికలలో శాశ్వత రాజకీయ నిరుద్యోగ పదవిని కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నూజివీడు: పట్టణంలోని సమస్యల పరిష్కారానికి పాలకవర్గం సహకారంతో కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీటి నిర్వహణ, వీధిలైట్లు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగు పరిచేందుకు అదనంగా వర్కర్లను తాత్కాలిక పద్ధతిపై తీసుకుంటున్నామని తెలిపారు. వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడదను నిరోధించేందుకు ఖాళీ స్థలాన్ని గుర్తించి, అక్కడికి కుక్కలన్నింటినీ తరలించాలని కోరారు. దీనికి జంతు ప్రేమికులు కూడా అభ్యంతరం చెప్పడం లేదన్నారు. ఇప్పటికే పూర్తి పన్ను చెల్లించిన వారికి కూడా వడ్డీ మాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానాన్ని పురపాలక శాఖ డైరెక్టర్‌కు పంపించాలని పగడాల కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి త్రివేణీదుర్గ, షేక్ మెహబూబ్‌బీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

నెమలి హైస్కూల్ స్థల వివాదంపై ఆర్డీఓ విచారణ



హైస్కూల్ స్థలం విషయమై విచారిస్తున్న ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

గంపలగూడెం: నెమలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్థలంలో ఆక్రమణల తొలగించాలంటూ అందిన ఫిర్యాదు మేర ఆర్డీఓ ప్రసన్నలక్ష్మీ మంగళవారం విచారించారు. గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థలానికి సంబంధించిన ఇరువర్గాల వాదనలను ఆమె విడివిడిగా విన్నారు. ఇదే విషయమై గతంలో కూడా ఒక పర్యాయం తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఇరువురువర్గాలతో సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోని నేపథ్యంలో ఆర్డీఓ నేరుగా విచారణ చేపట్టారు. కాగా హైస్కూల్‌కు రిజిస్టర్ అయి ఉన్న ఐదు ఎకరాల స్థలానికి సంబంధించిన హద్దులను వెంటనే నిర్ణయించి స్వాధీనపరచుకోవాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని ఆమె విచారణ అనంతరం ఆదేశించారు. ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఎస్సై వి.సతీష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సారంగపాణి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు కావూరి వినయ్‌కుమార్, నెమలి సర్పంచ్ దుబ్బాకుల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటకృష్ణ, ఫిర్యాదుదారు కుంభగిరి మురళీ పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరుపై సీఈకి వినతి

ఇబ్రహీంపట్నం: ఇటీవల జెన్‌కో ఉద్యోగులకు నూతన బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెట్టడంపై ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్ 129 నాయకులు చీఫ్ ఇంజినీర్ అశోక్‌కుమార్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మోదుగు మోహనరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న పాత హాజరు విధానం ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉందన్నారు. నూతన విధానంలో భోజన సమయంలో కూడా బయోమెట్రిక్ వేయాలనే విధానంతో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. నూతన బయోమెట్రిక్ హాజరుపై పునరాలోచన చేయాలని కోరారు.

ఇన్‌ఫ్లుయెంజాతో అప్రమత్తంగా ఉండాలి



తిరువూరు: మారిన వాతావరణ పరిస్థితుల్లో ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ సూచించారు. ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జనవిజ్ఞాన వేదిక ముద్రించిన కరపత్రాలను స్థానిక బోస్ సెంటర్లో మంగళవారం ఆవిష్కరించారు. దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి లక్షణాలు కనిపించినపుడు వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని గంగాధర్ కోరారు. వైద్యుల పర్యవేక్షణ, సూచనలు లేకుండా మందులు విచక్షణారహితంగా వాడవద్దని సూచించారు. చెకుముకి రాష్ట్ర కన్వీనర్ ఎం.హరికృష్ణ, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు రాంప్రదీప్, సుదర్శన్, పాపారావు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సరిహద్దురాళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలి



అనుముల్లంకలో సరిహద్దు రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్డీఓ

అనుముల్లంక(గంపలగూడెం): జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షపథకంలో భాగంగా రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించి సరిహద్దురాళ్లను ఏర్పాటు చేసే కార్యక్రమం వేగవంతం చేయాలని తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి తెలిపారు. గంపలగూడెం మండలంలోని అనుముల్లంకలో సరిహద్దు రాళ్లను ఏర్పాటు ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే పూర్తయిన కనుమూరు, అనుముల్లంక, వినగడప, గంపలగూడెం, చెన్నవరం, రాజవరం గ్రామాల్లో రాళ్లు పాతే కార్యక్రమం ఎంతవరకు వచ్చింది వివరాలను తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ మోహన్, వీఆర్వో మరకాల వెంకటేశ్వరావు, గ్రామ సర్వేయర్ జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు అత్తునూరు పద్మరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థి

నున్న(విజయవాడ రూరల్): మండలంలోని నున్న సమీపంలోని వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా సమితి, లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, కళాశాల చైర్మన్ నర్సిరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్ని 80 యూనిట్ల రక్తం దానం చేసినట్లు ప్రిన్సిపాల్ బీ రమణ తెలిపారు. కళాశాల కార్యదర్శి ఎన్.సత్యనారాయణ రెడ్డి, జాతీయ సేవా సమితి కో–ఆర్డినేటర్లు గోపాలకృష్ణ, ఫణి పాల్గొన్నారు.

వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టాలి



చంద్రాల(మైలవరం): గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న సంక్షేమాభివృద్ధిపై టీడీపీ వ్యతిరేక ప్రచారం చేస్తోందని, దీనిని తిప్పికొట్టాలని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు వలంటీర్లకు సూచించారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ సచివాలయంలో సర్పంచ్ జే జ్యోతి అధ్యక్షతన వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం వలంటీర్‌లకు అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో చంద్రాల ప్రజలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఓ సుందర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

చాట్రాయి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని కుల వివక్ష పోరాట సమితి నాయకులు కొమ్ము ఆనందం కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు ప్రభుత్వం రంగులు వేయాలని ఎంపీడీఓ మురళీమోహనరావుకి వినతి పత్రం అందజేశారు.

చిన్నంపేటలో డ్రోన్ సర్వే

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు డ్రోన్ సర్వే ప్రారంభించారు. మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తిరువూరు: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మంగళవారం తిరువూరు కేంద్రంలో ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 826 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావలసి ఉండగా, 790 మంది హాజరయ్యారు. 36మంది గైర్హాజరయ్యారు. తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాగార్జున కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సరం రసాయనశాస్త్రం, కామర్స్ పరీక్షకు పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో కలిపి మంగళవారం 77 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 1,605 మంది విద్యార్థులకు 1,528 మంది పరీక్షలకు హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 317 మందికి 25 మంది, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో 371 మందికి 16 మంది, శ్రీ శారద కళాశాలలో 541 మందికి 17 మంది, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలో 376 మందికి 19 మంది గైర్హాజరయ్యారు. నేటితో పరీక్షలు ముగియడంతో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

దాడి ఘటనపై కేసు

ఆగిరిపల్లి: దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.చంటిబాబు మంగళవారం తెలిపారు. వ్యవసాయ పనుచేసుకుని జీవించే మండలంలోని చిన్న ఆగిరిపల్లికి చెందిన పలగాని వెంకటేశ్వరరావుకు, తన సమీప బంధువు పలగాని హనుమంతరావుకు ఆస్తి వివాదంలో తనతో ఘర్షణ ఏర్పడింది. దీంతో వెంకటేశ్వరరావుపై హనుమంతరావు దాడి చేసి గాయపరిచాడు. వెంకటేశ్వరరావుకు తలపై గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కౌంటర్ కేసుల నమోదు

గంపలగూడెం: మండలంలోని కనుమూరులో ఫేస్బుక్ పోస్టింగ్ విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై అందిన వేర్వేరు ఫిర్యాదుల మేరకు మంగళవారం కౌంటర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వి. సతీష్ తెలిపారు. చెరుకు భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై దాడికి పాల్పడిన బాలకోటిరెడ్డి, శశికుమార్‌రెడ్డి, మరొకరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా తమపై దాడి చేశారంటూ బాలకోటిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెరుకు భాస్కర్‌రెడ్డి, రేగళ్ల మాధవరెడ్డి పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

తిరువూరు: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని స్త్రీ వైద్యనిపుణులు మధుకీర్తి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక షాదీఖానాలో తిరువూరు ప్రాజెక్టు స్థాయిలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. చిరుధాన్యాలతో మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గోరుముద్ద పథకం కింద అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి, ఏసీడీపీఓ ఝాన్సీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సత్వర వైద్యసేవలందించాలి

చౌటపల్లి(తిరువూరురూరల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు సత్వర వైద్యసేవలందించాలని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి కోరారు. మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. వైద్యాధికారి కల్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్ ప్రాంతాల్లో తనిఖీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీటీపీఎస్ ప్రాంతాల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీ మంగళవారం చేపట్టారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో సంస్థ ద్వారా ఏర్పడిన కాలుష్యాన్ని స్థానిక షాబూఖారీ దర్గా ఆవరణలో ఎనలిస్ట్ విజయసారధి, సిబ్బంది పొల్యూషన్ శాంపిల్స్ తీసి నివేదిక కోసం ల్యాబ్‌కు పంపించారు. పెరిగిన కాలుష్యంపై ఎన్టీటీపీఎస్ సంస్థ నివారణ చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు కాలుష్య నియంత్రణ సంస్థకు పిర్యాదు చేశారు. తనిఖీకి వచ్చిన అధికారులు ఎన్టీటీపీఎస్ వాహనంలో రావడంపై షాబూఖారీ దర్గా మతగురువు మహ్మద్ అల్తాఫ్‌రజా, పలువురు మత పెద్దలు అనుమానాలు వ్యక్తం చేశారు.

చలో ఢిల్లీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తోటమూల(గంపలగూడెం): అఖిలభారత రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను మంగళవారం తోటమూలలో ఆవిష్కరించారు. గ్రామంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి మాట్లాడుతూ కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో కార్మికులు, కర్షకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు చిన్న సత్యంబాబు, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోపి పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ

తిరువూరు: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏప్రిల్ ఐదో తేదీ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ తిరువూరు మండల కార్యదర్శి బీ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక షాదీఖానా వద్ద అంగన్‌వాడీ, ముఠావర్కర్స్ యూనియన్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. రైతుసంఘ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం మంగళవారం నాటికి ఆరో రోజుకు చేరింది. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి టెలీకాన్ఫరెన్స్ మెడికల్ సదుపాయం ఉందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ దివ్య, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి, భవాని, శ్రీనివాస్, ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ బోర్లతో వ్యవసాయానికి ఊతం

ముసునూరు: వైఎస్సార్ జలకళ బోర్లు చిన్న, సన్నకారు రైతుల వ్యవసాయానికి ఊతంగా నిలుస్తాయని వ్యవసాయ సొసైటీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అన్నారు. ముసునూరు మండలం కొర్లగుంటలో వైఎస్సార్ జలకళ బోరును సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఆరు బోర్లు మంజూరు కాగా తొలి బోరును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుందరరావు, ఉపాధి హామీ ఏపీఓ జయప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల బాక్సులను గ్రామస్థాయిలోనే తెరవాలి

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సులను ప్రతి నెలా తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంతో ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులకు, మహిళా టీచర్లకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఎస్టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నేతలు మంగళవారం తహసీల్దార్ ఉదయ్ భాస్కరరావుకువినతిపత్రం అందజేశారు. గ్రామస్థాయిలోనే ఫిర్యాదు బాక్సులను అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి కె.వంశీవశిష్ఠ, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.కృష్ణ, జోగిరాజు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ దినోత్సవం



ఊటుకూరులో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

ఊటుకూరు(గంపలగూడెం): వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని గంపలగూడెం మండలం ఊటుకూరులో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బస్‌స్టాప్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు, సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించి కేకు కట్ చేశారు. ఉప సర్పంచ్ రాఘ వయ్య, ట్రేడ్ యూనియన్ శాఖ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు రహంతుల్లా, సెక్రటరీ రంజిత్‌కుమార్, నాగులమీరా పాల్గొన్నారు.

పశువుల రక్త నమూనాల సేకరణ

నెమలి(గంపలగూడెం): గాలికుంటు నివారణ వ్యాక్సిన్ ఎంతవరకు ప్రయోజనకరంగా ఉంటుందనే విషయమై నిర్ధారించేందుకు పశువులనుంచి పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రక్తనమూనాలను సేకరించారు. గంపలగూడెం మండలం నెమలిలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ పశువ్యాధి నిర్ధారక ప్రయోగశాలకు చెందిన వైద్యులు సుస్మిత, సుజనీ 15 ఆవులు,గేదెల నుంచి రక్త నమూనా సేకరించారు. గంపలగూడెం పశువైద్యాధికారి అభిలాష్, ఎల్ఎస్ఏ చిన్నప్ప పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు

నూజివీడు: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ నూరాని సూచించారు. నూజివీడు మండలం గొల్లపల్లిలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి గా పాల్గొన్న నూరాని మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే వరకు ముందుకు సాగాలన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం రవీంద్ర, ఉపాధ్యాయులు పద్మ, శివ, నాగమణి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.